నల్లకుంట బీజేవైఎం అధ్యక్షుడిగా సుమన్



నల్లకుంట: నల్లకుంట డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా కోదాటి సుమన్‌ను నియమిస్తూ బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాత్రి నగర కార్యాలయంలో దీపక్‌రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ అమృతతో కలిసి సుమన్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వనం రమేష్, కె.లక్ష్మణ్‌కుమార్, కేజే. బాబు, ఎంబీ కిషోర్‌కుమార్, మల్లికార్జున్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శిగా నాయిని బుచ్చిరెడ్డి



నాయిని బుచ్చిరెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అంబర్‌పేట: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శిగా నియమితులైన నాయిని బుచ్చిరెడ్డికి బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయనను డీడీ కాలనీలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజీయూఎస్ నూతన కార్యవర్గానికి సన్మానం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: కొత్తగా ఎన్నికైన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్)కార్యవర్గ సభ్యులను శుక్రవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు. సెప్టెంబర్ 6వ తేదీన జరిగే గణేష్ నిమజ్జన మహోత్సవంలో పాల్గొనాలని ఈ సందర్భంగా దత్తన్నను ఆహ్వానించారు. సన్మానం పొందిన వారిలో ప్రధాన కార్యదర్శి శశిధర్, ఉపాధ్యక్షుడు అగర్వాల్, కార్యదర్శి ఆలే భాస్కర్, సభ్యులు బద్దం మైపాల్ రెడ్డి, నాయిని బుచ్చిరెడ్డి, ఆనంద్‌గౌడ్, వైకుంఠం, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

‘ప్రజల కథే.. నా ఆత్మకథ’ పుస్తకం బహూకరణ




సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి శుక్రవారం హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి, యోగాక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రొయ్యూరు శేషసాయికి ‘ప్రజల కథే.. నా ఆత్మకథ’ పుస్తకాన్ని దత్తన్న బహూకరించారు.

మనీష్‌యాదవ్‌ను అభినందించిన దత్తన్న

ముషీరాబాద్: రాంనగర్‌కు చెందిన పర్వతారోహకుడు మనీష్‌యాదవ్‌ను శుక్రవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సత్కరించి అభినందించారు. కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. మనీష్‌యాదవ్ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని దత్తాత్రేయ ఆకాంక్షించారు.

కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి యాదిలో..

చిక్కడపల్లి: జంధ్యాల పాపయ్యశాస్త్రి రచనలు సున్నితమైన భావాలతో ముడిపడి ఉంటాయని ఎస్బీఐ విశ్రాంత ఉన్నతాధికారి, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి యాదిలో.. ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రచించిన పుష్పవిలాపం అందరి హృదయాలను తాకుతుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు శంకరప్రసాద్, పీఎంకే గాంధీ, మంగరాజు రుక్మిణి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



జంధ్యాల పాపయ్యశాస్త్రికి నివాళులర్పిస్తున్న చింతలపూడి త్రినాథరావు



మార్కెట్లకు రాఖీ శోభ



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రక్షాబంధన్ అన్నది అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, అనుబంధానికి ప్రతీకగా జరిపే పండుగ. శ్రావణ పౌర్ణమి రోజున చెల్లి, అన్నయ్య చేతికి రాఖీ కట్టి ఆపదలో తనను కాపాడాలని కోరుకుంటుంది. ఇది కుటుంబ బంధాలను బలపరిచే పండుగగా ప్రసిద్ధి చెంది దేశవ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకుంటారు. కొత్త బట్టలు ధరించి సుదూర ప్రాంతాల నుంచి సైతం తన అన్నదమ్ముళ్లకు రాఖీలను కట్టి తమ అనుబంధాన్ని పంచుకుంటారు. కుటుంబ సభ్యులంతా ఆహ్లాదంగా పండుగ వాతావరణంలో వెలుగుతారు. రక్షాబంధన్ సందర్భంగా మార్కెట్‌లో రాఖీలు, బహుమతులు, స్వీట్లు, చాక్లెట్‌లు ఫ్యాషన్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటూ, అమ్మకాలు ఘననీయంగా పెరుగుతాయి. 2024 వ సంవత్సరంలో రాఖీ వ్యాపారం రూ.12వేల కోట్ల వరకు చేరినట్లు ట్రేడర్ల సమైక్య అంచనా వేసింది. ఇది గతేడాది కంటే సుమారు 20 శాతం అధికం. బ్లింకిట్, స్విగ్గి, ఇన్‌స్టా మార్ట్, వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ నిమిషానికి వందల రాఖీలు విక్రయించినట్లు సమాచారం. చిన్నారుల కోసం కార్టూక్, క్యారెక్టర్స్ రాఖీలు ప్రధాని మోదీ చిత్రాలతో ఉండే రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్కెట్‌లో రూ.10 నుంచి రూ. 50 వరకు రాఖీలు విడివిడిగా లభిస్తున్నాయి. సంప్రదాయానికి కొత్త హంగులు కలిసిన రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమైన మార్కెట్‌లు సందడిగా మారాయి. రాఖీల డిమాండ్ దేశీయ ఉత్పత్తులు ఘననీయంగా పెరిగాయి. విభిన్న రంగులు, ఆకృతుతు చిన్న, పెద్దలను ఆకట్టుకునే విధంగా రాఖీలు ఉన్నాయి.

◆ అంబర్‌పేట: రాఖీ సందడితో అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడు అనుబంధానికి ప్రతికైనా రాఖీ పండుగ నేపథ్యంలో మార్కెట్లు కళకళాడుతున్నాయి. శుక్రవారం రాఖీ కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి.

విద్యాశాఖలో అవినీతి, అవకతవకలు



కాచిగూడలో జాబితాను తగులబెడుతున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

కాచిగూడ: సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖలో అవినీతి, అవకతవకలు జరుగుతున్నాయని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్ర ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌లో జరిగిన సీట్ల తారుమారు, అవకతవకల జాబితాను విద్యార్థులతో కలిసి శుక్రవారం కాచిగూడలో ఆయన తగులబెట్టారు. ఇంజినీరింగ్ సీట్లలో జరిగిన అవకతవకలపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అవకతవకలను, తప్పులను సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి విద్యార్థుల సీట్ల జాబితాను తొలగించారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఎప్‌సెట్ అధికారిక వెబ్‌సైట్ నుండి కాలేజీల వారీగా అడ్మిషన్ల వివరాలు, విద్యార్థులకు కేటాయించిన సీట్ల కేటగిరీల వివరాలను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ‘ఓపెన్ గర్ల్స్ కోటా సీట్లను అబ్బాయిలకు కట్టబెట్టిన అధికారులు, ఇప్పుడు తమ తప్పులను దాచిపెట్టేందుకు సీట్ల కేటగిరీల వివరాలను మాయం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు వేదా అర్జున్, తేజస్, విప్లవ్, రుద్రాన్స్, దేవాన్ష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పీజే సుధాకర్ బహుముఖ ప్రజ్ఞాశాలి

సుధాకర్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది: దత్తన్న

ముషీరాబాద్: ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ మాజీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పీజే సుధాకర్ మృతి పట్ల హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. డాక్టర్ సుధాకర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. తనతో ఎంతో ఆత్మీయతతో ఉండే వారని తెలిపారు. 120 డిగ్రీలకు పైగా సంపాదించి నిత్య విద్యార్థిగా ఆయన ఎంతో విజ్ఞానాన్ని సంపాదించారని కొనియాడారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ , జర్నలిజం, విద్యాహక్కు చట్టం, సమాచార హక్కు చట్టం లాంటి చట్టాలపై ఎంతో పట్టు కలిగిన వ్యక్తి అని దత్తాత్రేయ గుర్తు చేశారు. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, పీఐబీ విభాగాలలో అంకితభావంతో నిస్వార్థంతో విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రామిరెడ్డి

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ ఉద్యమకారులు జేఏసీ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసులతో న్యాయస్థానాల చుట్టూ తిరగలేక ఉద్యమకారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మానసిక క్షోభకు గురవడంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు పొరుగు సేవల సంస్థల్లో తెలంగాణ ప్రాంతం వారికి అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. టీయూజేఏసీ మాజీ చైర్మన్ వెంకట మల్లయ్య మాట్లాడుతూ... ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ప్రజ్ఞాత్‌కుమార్, నేతలు వెంకటస్వామి, హరిప్రసాద్, సాయిలు, అంజలికుమారి, లావణ్య, స్వరూపరాణిహ, సుచరిత, వేముల యాదగిరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రుద్రసహిత చండీహోమం



కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకొని రుద్రసహిత చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ఫౌండర్ చైర్మన్ గౌతమ్‌కుమార్ పటేల్, ఆలయ ప్రధానార్చకులు సాత్విక్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ సతీష్ తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే చండీహోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

13న శ్రీకృష్ణుడి వేషధారణ పోటీలు

పేర్లు నమోదు చేసుకోవాలని వినతి

చిక్కడపల్లి: చిక్కడపల్లి బ్రహ్మకుమారి కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 13న శ్రీకృష్ణుడి వేషధారణ పోటీలను నిర్వహిస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి జయశ్రీ తెలిపారు.త్యాగరాయ గానసభలో ఉదయం 10నుంచి 12గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు చదివే పిల్లలు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈనెల 12వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం .93965 23408లో సంప్రదించాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

సర్కిల్ 15 డీఎంసీ రామానుజులురెడ్డి

కవాడిగూడ: ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్కిల్-15 డీఎంసీ రామానుజులురెడ్డి,ఏఎంహెచ్‌ఓ డా.ప్రవీణ కోరారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం కారణంగా శుక్రవారం ఉదయం కవాడిగూడ డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ, వైద్య అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీకాలనీల ప్రజలకు ఎంటమాలజీ వింగ్ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఉన్నికోట బస్తీ సమీపంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. మట్టికుప్పలు, చెత్తాచెదారం పేరుకుపోయి కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల వైద్యానికి ఎంతో భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన లబ్ధి చేకుర్చేలా తన వంతు చొరవ తీసుకుంటానని ఆయన తెలిపారు. శుక్రవారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి 18 లబ్ధిదారులకు మంజూరైన రూ.5.92 లక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ‘ముస్లింల బిల్లు’గా పేర్కొనడం సరికాదు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీసీల దశాబ్దాలుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసుకున్నారని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వం పంపిందన్నారు. బీసీల కల నెరవేరే సమయంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఇది ‘ముస్లింల బిల్లు’అని పేర్కొనడం సరికాదన్నారు. బీసీల చారిత్రక పోరాటాన్ని తక్కువ చేసి చూపే చౌకబారు రాజకీయాలను బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. రాత్రికి రాత్రే రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యూఎస్ పేరుతో 10శాతం రిజర్వేషన్లు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం బీసీల విషయంలో ఎందుకు నాన్చుడు ధోరణి అవలంభిస్తోందని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్ల పేరిట బీసీ బిల్లులను తప్పుదోవ పట్టించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీసీని ప్రధానమంత్రిని చేసినంత మాత్రాన బీసీల సమస్యలు తీరవన్నారు. బీసీ బిల్లును బీజేపీ అడ్డుకుంటే బీసీల హక్కులను తాకట్టు పెట్టడమేనని అన్నారు.

పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి మార్గదర్శకం



పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

అంబర్‌పేట: పెత్తందారి వ్యవస్థ పండుగ సాయన్న ముదిరాజ్ పోరాట స్ఫూర్తి ఎంతో మార్గదర్శకమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్‌లో బాపునగర్- చెన్నారెడ్డినగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి కార్యక్రమం జరిగింది. దీనికి పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు హాజరైన సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్, శ్రీరాములు ముదిరాజ్, మహేశ్ మదిరాజ్, నజై మదిరాజ్, నాగేష్ ముదిరాజ్, సంఘం అధ్యక్షులు ఆకుల బాల్‌రాజ్, ఉపాధ్యక్షులు కొరిమి వేణు, ప్రతినిధులు రాజు, శేఖర్, నరేందర్, వెంకటేశ్, కిషన్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పితామహుడు ‘బీపీ మండల్’



బీపీ మండల్, పండుగ సాయన్న చిత్రపటాలకు నివాళులర్పింస్తున్న బాలరాజ్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ అని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజ్‌గౌడ్ అన్నారు. మండల్ కమిషన్ 40 ప్రతిపాదనలతో ఉన్న నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. ఆ తర్వాత 1990 ఆగస్టు 7న కమిషన్ సిఫార్సులలో భాగంగా బీసీలకు 27 శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో ఆమోదం లభించిందన్నారు. అందుకే దేశంలో నేడు ‘మండల్ డే’గా ఓబీసీలు జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారు బీపీమండల్, పండుగ సాయన్న చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలన్నారు. ఓబీసీలకు విద్య, ఉద్యోగ, చట్టసభల్లో 56 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న స్ఫూర్తితో బీసీలంతా ఏకమై బీసీ ముఖ్యమంత్రి అయ్యే వరకు పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిలి వెంకన్నగౌడ్, విజయకుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం



వర్షాలకు రాంనగర్‌లో కూలిన ఇల్లు



ముషీరాబాద్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు నాగేష్‌ముదిరాజ్

ముషీరాబాద్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాంనగర్ రామాలయం వెనుక వీధిలో ఇల్లు (1-9-122) కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లోని బీరువాలు, వంట సామగ్రీ పూర్తిగా ధ్వంసమైయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వర్షానికి నానిపోయిన పై కప్పు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ సమయంలో కృష్ణ బయటకు వెళ్లగా శ్రీనివాస్ పనికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు సాయికృష్ణయాదవ్, నాయకులు దిన్నుముదిరాజ్, కిషన్ తదితరులు ఇంటిని పరిశీలించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, ముషీరాబాద్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా నాగేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఇందిరమ్మ ఇల్లును కేటాయించాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి తక్షణ సహాయంగా రూ.50వేల అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పవిత్ర మాసం.. పోటెత్తిన భక్తజనం

• స్వర్ణ కచితాలంకరణలో శారదాంబ • ఆలయాలు, ఇళ్లల్లో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించిన మహిళలు



శారదాంబకు కుంకుమార్చన చేస్తున్న అర్చక

నల్లకుంట: పవిత్ర శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని నల్లకుంటలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక శంకరమఠంలో ఉదయం అర్చక స్వాములు శక్తి గణపతికి ఆది పూజలు చేశారు. చంద్రమౌళీశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని స్వర్ణ కచిత (బంగారు చీర) అలంకరణలో దర్శనమిచ్చిన శారదాంబ భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ కవచ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పూజలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ముత్తైదువులకు ఆకు వక్క, పసుపు కుంకుమ, పండ్లు ఇచ్చి వాయినం ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ కావించారు.

◆ న్యూనల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయంలో సరస్వతి మాతకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు..

◆ శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని పూజల కోసం మహిళలు పెద్ద ఎత్తున పండ్లు, పూలు కొనుగోలు చేశారు. దీన్ని ఆసరా చేసుకుని శంకరమఠం, నల్లకుంట, గోల్నాక మార్కెట్లతో పాటు రోడ్ల పక్కన తోపుడు బండ్ల వ్యాపారులు పూలు, పండ్లు, అరటి దొనెల ధరలను రెట్టింపు చేశారు. భారమైనప్పటికీ వరలక్ష్మి పూజకు పూలు, పండ్లు తప్పనిసరి కావడంతో చేసేదేమి లేక వ్యాపారులు చెప్పిన ధరలకు కొనుగోలు చేశారు.



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో భువనేశ్వరిదేవి పూజలో భక్తులు

కవాడిగూడ డివిజన్‌లో అభిషేకాలు, అర్చనలు

కవాడిగూడ: డివిజన్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం, అడ్వకేట్‌కాలనీలోని బాలత్రిపుర సుందరిదేవి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు చేయించారు. బాలత్రిపుర సుందరిదేవి ఆలయంలో జరిగిన పూజల్లో ఆలయ చైర్మన్, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బస్తీవాసులు సీహెచ్ శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

చిక్కడపల్లి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగపతి, లేబర్ కార్యాలయం వద్ద ఉన్న అష్టలక్ష్మి, హనుమాన్ ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వరలక్ష్మికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈపూజల్లో ఆలయాల చెర్మన్లు జానకీసుధాకర్, నర్సింగ్‌రావు, ఈవోలు దేవనాథం, పి.లక్ష్మారెడ్డి, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, భవనందశర్మ, గోపాలాచారి, జగన్‌మోహనాచారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాలత్రిపుర సుందరిదేవి ఆలయ పూజలో భక్తులు



జవహర్‌నగర్‌లో వరలక్ష్మి వ్రతం భక్తుల పూజలు



వరలక్ష్మి వ్రతంలో కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి